క్లుప్తంగా

తాగునీటి కోసం ఆందోళన



ఆందోళన చేస్తున్న తండావాసులు

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని వెల్జర్ల గ్రామ పంచాయతీ గొల్లకుంట తండావాసులు మంచినీటి కోసం గురువారం రోడ్డెక్కారు. ఖాళీ బిందెల, డబ్బాలతో నిరసన వ్యక్తం చేశారు. వారి ఆందోళనకు బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, కుమార్‌లు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా తండావాసులు మాట్లాడుతూ.. గత 12 రోజులుగా మంచినీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న ఎవ్వరు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులకు విన్నవించినా ఎలాంటి ఫలితం లేదన్నారు. పండగ పూట కూడా నీటి కోసం వెంపర్లాడాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. వెంటనే అధికారులు, నాయకులు స్పందించి మంచినీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

టోర్నమెంట్ ప్రారంభం



టోర్నమెంట్ ప్రారంభిస్తున్న నాయకులు

కొందుర్గు: మండలంలోని చిన్నఎల్కిచర్ల గ్రామంలో ప్రీమియర్ లీగ్–2 క్రికెట్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. తంగెళ్లపల్లి మాజీసర్పంచ్ రామకృష్ణ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో వ్యవహరించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను నిర్వహించడం వల్ల ప్రతిభ కలిగిన క్రీడాకారులు వెలుగులోకి వస్తారని అన్నారు. క్రీడలతో దేహదారుఢ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, మంజుల, అంచరాములు, కృష్ణయ్య, శివరాజ్, సత్యం, రాఘవేందర్, వెంకటేష్, అఖిల్‌రెడ్డి పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

మొయినాబాద్: మండల పరిధిలోని చందానగర్‌లో నిర్వహిస్తున్న చేవెళ్ల నియోజకవర్గ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ గురువారం ప్రారంభమైంది. కాంగ్రెస్ చేవెళ్ల ఏ బ్లాక్ అధ్యక్షుడు మందడి మల్లారెడ్డి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీల్లో 50 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు రాజు, గౌరి, శంకర్, ఫెరోజ్ తెలిపారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. క్రీడాకారులు పోటీలను క్రీడాస్ఫూర్తితో ముందుకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఠాక్రేకు సన్మానం




ఠాక్రేను సన్మానిస్తున్న శంకర్

షాద్‌నగర్: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా రాష్ట్రానికి వచ్చిన మాణిక్‌రావుఠాక్రేను గురువారం టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లిశంకర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గాంధీభవన్‌లో మాణిక్‌రావుఠాక్రేను టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో కలిసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ నెల 26నుంచి జరగబోయే 'హాత్‌సేహాత్ జోడో' కార్యక్రమానికి సంబంధించి నియోజకవర్గ ఇన్‌చార్జిలకు పలు సూచనలు, సలహాలు చేసినట్లు శంకర్ తెలిపారు.

ఠాక్రేను కలిసిన చేవెళ్ల నాయకులు

చేవెళ్ల: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేను చేవెళ్లకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మాణిక్‌రావు ఠాక్రే టీపీసీసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం ఆయన నియోజకవర్గం నాయకులు శాలువ, పుష్పగుచ్ఛంతో సన్మానించారు.

నూతన నియామకం



నియామక పత్రం అందజేస్తున్న జహంగీర్

మొయినాబాద్: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ మొయినాబాద్ అధ్యక్షుడిగా మహ్మద్ రియాజుద్దీన్ నియమితులయ్యారు. గురువారం నగరంలోని మైనార్టీసెల్ చైర్మన్ జహంగీర్ నియామక పత్రం అందజేశారు. మైనార్టీల అభివృద్ధికి, కాంగ్రెస్ పార్టీ విస్తరణకు కృషి చేయాలని జిల్లా చైర్మన్ జహంగీర్ సూచించారు. అనంతరం రియాజుద్దీన్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఖాజాపాషా తదితరులు ఉన్నారు.



షాద్‌నగర్: రవీంద్రభారతి పాఠశాలలో ముగ్గులు వేసిన విద్యార్థులు



షాద్‌నగర్ రూరల్: కృష్ణవేణి పాఠశాలలో..

ముగ్గుల సంబురం

షాద్‌నగర్, చేవెళ్ల నియోజకవర్గాల్లోని ఆయా పాఠశాలలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో గురువారం సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల ప్రాంగణంలో వివిధ రంగు రంగుల రంగవల్లులను తీర్చిదిద్దారు. అనంతరం ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు రంగురంగుల పతంగులను ఎగురవేస్తూ కేరింతలు కొడుతూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



కొత్తూరు: ముగ్గులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు



కేశంపేట: విద్యార్థినులు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు



శంకర్‌పల్లి: ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



కొందుర్గు: బాలికల ప్రాథమికోన్నత పాఠశాలలో ముగ్గులు వేసిన విద్యార్థులు

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి



చెక్కు అందజేస్తున్న అవినాశ్‌రెడ్డి

షాబాద్: పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంలాంటిదని జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎల్గొండగూడ గ్రామానికి చెందిన అణపురం నర్సింహులు భార్య మమత రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాలును కోల్పోయింది. దీంతో ఆమెకు రూ. 2 లక్షల 50వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆపదలో ఉన్న ప్రతి కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ నిధులను అందిస్తుందని తెలిపారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలును కోల్పోయిన మమత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మండల మైనార్టీ అధ్యక్షుడు ముఖ్రంఖాన్, ఎంపీటీసీ మధుకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి, రాందేవ్‌యాదవ్, శ్రీశైలంగౌడ్, శివకుమార్, శేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

ఘనంగా వివేకానంద జయంతి

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాలతో పాటు పద్మారం, పెద్దఎల్కిచర్ల, గంగన్నగూడ గ్రామాల్లో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి నిరంతర కృషి

ఎమ్మెల్యే కాలె యాదయ్య



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

శంకర్‌పల్లి: పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 28మంది లబ్ధిదారులకు రూ. 13లక్షల 17వేల సీఎం సహాయనిధి చెక్కులు, 60మంది లబ్ధిదారులకు రూ. 60,06,960 కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పేద ప్రజల సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశ పెట్టారు. సీఎం సహాయనిధి నుంచి కోట్ల రూపాయాలతో రోగులకు కార్పొరేట్ వైద్యం చేయిస్తున్నారు. అలాగే, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం ద్వారా పేదింటి యువతిల వివాహానికి రూ. 1,01,116 అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, తహసీల్దార్ నయిముద్దీన్, ఎంపీడీఓ వెంకయ్యగౌడ్, కమిషన్ జ్ఞానేశ్వర్, ఏఎంసీ చైర్మన్ పాపారావు, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు గోపాల్ పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్ రావడం ఖాయం

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటేష్‌గుప్త



నూతన బూత్ కమిటీ సభ్యులతో వెంకటేష్‌గుప్త

షాద్‌నగర్: రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ రావడం ఖాయమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటేష్‌గుప్త అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో గ్రామ బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేష్‌గుప్త, బాబయ్య మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రధాని నరేంద్రమోదీ అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను చేపడుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నర్సింహా, వెంకటేష్, మల్లేష్, లింగం, కృష్ణయ్య, యాదయ్య, శ్రీను, వెంకట్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి, వంశీరెడ్డి, ఆంజనేయులు, ఇషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా బీఆర్‌ఎస్

ఎంపీపీ రవీందర్ యాదవ్



చెక్కులను అందజేస్తున్న ఎంపీపీ

కేశంపేట: నిరుపేదలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపీపీ ఎల్లనమోని రవీందర్ యాదవ్ అన్నారు. గురువారం మండలంలోని వివిద గ్రామాలకు చెందిన పలువురికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను ఎంపీపీ రవీందర్ యాదవ్ ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆపదలో ఉన్న నిరుపేదలు సీఎం సహాయనిధి అండగా ఉంటుందన్నాదనరి చెప్పారు. మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మంజులకు రూ.22వేలు, దేవునిగుడితండాకు చెందిన లక్ష్మీకి రూ.60వేలు, రాజుకు రూ.32వేలు, సంతాపూర్‌కు చెందిన ఖలీల్‌కు రూ.40వేలు, చౌలపల్లికి చెందిన సైదులుకు రూ.22వేలు, జంగమ్మకు రూ.10వేల చెక్కులను ఆయన బాధిత కుటుంబ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, శ్రీశైలం, సత్యానారాయణ, శేఖర్ పంతులు, రామకృష్ణ, లక్ష్మయ్య, దశరధ పాల్గొన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న సుదర్శన్, అవినాశ్‌రెడ్డి, ఎంఈఓ

షాబాద్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ నిరంతరం కృషి చేస్తుందని ఆ సంఘం మండల అధ్యక్షుడు సుదర్శన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో పీఆర్టీయూ–2023 క్యాలెండర్, డైరీని జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, షాబాద్ ఎంఈఓ శంకర్‌రాథోడ్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పీఆర్టీయూ ఎంతో కృషి చేస్తున్నారు. ఉపాధ్యాయులు దీర్ఘకాలికంగా ఎదురు చూస్తున్న బదిలీలు ప్రమోషన్లు, పండిట్, పీఈటీ అప్‌డేషన్, సీపీఎస్ రద్దు కోసం తమ సంఘం కృషి చేస్తున్నారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలలో పీఆర్టీయూ టీఎస్ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి అవకాశం రావడం మన జిల్లాకు దక్కిన గౌరవమని తెలిపారు. గుర్రం చెన్నకేశవరెడ్డికి ఉపాధ్యాయులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, విజయలక్ష్మి, జంగయ్య, దశరథరెడ్డి, డేవిడ్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, రాష్ట్ర బాధ్యులు అంజయ్య, రవీందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సంఘం మండల కార్యదర్శి కృష్ణ, గౌరవ అధ్యక్షులు యాదయ్య, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కావాలి

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరు భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. గురువారం టీయూఎఫ్‌ఐడీసీ నిధులతో షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని న్యూసిటీ కాలనీలో రూ.70.5లక్షలు, వెంకటరమణ కాలనీలో రూ.67.5లక్షలు, సేవాలాల్ దేవాలయం వద్ద రూ.16లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అదేవిధంగా దళిత బంధు పథకం కింద మంజూరైన నిధులతో ముంతాజ్ ఫంక్షన్ హాల్ వద్ద ఏర్పాటు చేసిన ఫుట్‌వేర్ షాప్, గంజ్‌లో ఏర్పాటు చేసిన చంద్రశేఖర్ మెన్స్‌వేర్ షాప్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షాద్‌నగర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం కేసీఆర్ అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపడుతున్నారని అన్నారు. నిరుపేద దళితుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం దళితబంధు పథకాన్ని ప్రారంభించిందని చెప్పారు. ఈ పథకం కింద మంజూరైన నిధులతో లబ్దిదారులు ఉపాధి పొందుతున్నారని అన్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, మాజీ చైర్మన్ విశ్వం, జూపల్లి కౌసల్య, శ్రావణి, ఈట గణేష్, ఈశ్వర్‌రాజు, జమృద్‌ఖాన్, జూపల్లి శంకర్, బచ్చలి నర్సింహ్మ, చెట్ల నర్సింహ్మ పాల్గొన్నారు.


రుణమాఫీ చేసేవరకు పోరాడుతాం



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

కొందుర్గు: రైతులకు పంట రుణాలను మాఫీ చేసేవరకు పోరాడుతామని బీజేపీ నేత మిథున్‌రెడ్డి అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో గురువారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మిథున్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తామని అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చిన కేసీఆర్ ప్రస్తుతం రుణమాఫీ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. మాట తప్పిన ఈ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో రైతులు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీవర్ధన్ రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, బాబయ్య, భూపాలచారి, శ్రీనివాసు, అశోక్, కురుమయ్య, శివరాజ్ పాల్గొన్నారు.

విద్యార్థికి నివాళి



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కొత్తూరు: మండల కేంద్రంలో బైక్ అదుపు తప్పి ఓ విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన నందిగామ మండలం రంగాపూర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో విష్ణువర్ధన్ 8వ తరగతి చదువుతున్నాడు. గ్రామంలోని ఓ ఆలయానికి బంధువుతో కలిసి బైక్‌పై వెళ్తున్న క్రమంలో గ్రామశివారులో బైకు అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. దీంతో తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతి చెందిన విద్యార్థి చదువుల్లో చురుకుగా ఉండేవాడని తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు గుర్తు చేసుకుని బాలుడి ఆత్మకుశాంతి చేకూరాలని నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె.భాగ్యమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకుడు అహ్మద్

చేవెళ్ల: బూత్‌స్థాయిలో యువతను బలోపేతం చేసేందుకు యువజన కాంగ్రెస్ కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి సెక్రటరీ సయ్యద్ ఖలీద్ అహ్మద్ అన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని యువజన కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం యూత్‌జోడో బూత్‌జోడో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి బూత్ నుంచి తప్పనిసరిగా 5మంది చొప్పున రిజిస్ట్రేషన్ చేయించాలని చెప్పారు. యూత్ కాంగ్రెస్ నాయకుడు శివసేనరెడ్డి పిలుపు మేరకు ఈ యూత్ జోడో బూత్‌జోడో కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.

జాతీయస్థాయిలో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మొయినాబాద్‌రూరల్: జాతీయస్థాయికి వైజ్ఞానిక పర్యావరణ ఇన్స్‌పైర్‌కు చేవెళ్ల గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమని చేవెళ్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి అన్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నిర్మల్ జిల్లాలోని కొండాపూర్‌లో సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో వైజ్ఞానిక పర్యావరణ ఇన్స్‌పైర్ మనక్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 256 నమూనాలను ప్రదర్శించగా 26 నమూనాలు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి. ఇందులో చేవెళ్ల విద్యార్థినులు ప్రదర్శించిన ప్లాస్టిక్ ఈటింగ్, వెజిటెబుల్, మష్రూమ్ జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి. ఈ నమూనాలను రిపబ్లిక్ డే 26న ఢిల్లీలో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ విద్యార్థులను అభినందించారు.

ప్రమాదాల నివారణ కోసమే తనిఖీలు

మొయినాబాద్ సీఐ లక్ష్మారెడ్డి



మొయినాబాద్‌రూరల్: హెల్మెట్ లేని వారికి చలాన్‌లు విధిస్తున్న పోలీసులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని అమ్డాపూర్ చౌరస్తా, జేబీఐటీ ఆయా ప్రాంతాల్లో పోలీసుల వాహనాల తనిఖీలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేని వాహనదారులను ఆపి వారికి చలాన్‌లు విధించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. అనంతరం త్రిబుల్ రైడింగ్, లైసెన్స్ లేని వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాహనదారులు అన్ని పత్రాలను జాగ్రత్తగా పెట్టుకొని హెల్మెట్‌ను ధరించి వాహనాలను నడిపిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉంటాయన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడే హెల్మెట్ లేని కారణంగా ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఇప్పటికైనా నిబంధనలను పాటిస్తూ జాగ్రత్తగా వెళ్లినప్పుడే సక్రమంగా తమ ఇంటికి చేరుకుంటారని అన్నారు. ఈ తనిఖీల్లో పోలీసులు ఏఎస్‌ఐ శివారెడ్డి, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

షాద్‌నగర్‌టౌన్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని షాద్‌నగర్ ట్రాఫిక్ సీఐ శ్రీశైలం అన్నారు. ప్రమాదాల నివారణలో భాగంగా షాద్‌నగర్ శివారులో గురువారం ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీశైలం మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. వారిని కోర్టులో ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. ద్విచక్రవాహనాలు నడిపే వారు విధిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపించే వారు సీటు బెల్టు పెట్టుకోవాలని తెలిపారు. ఆటోల్లో పరిమితి సంఖ్యకు మించి ప్రయాణీకులను ఎక్కించుకోవద్దని చెప్పారు. వాహనదారులు ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్సును తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరు సహకరించాలని కోరారు.